సాక్షి ఖమ్మం

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



పతనం దిశగా పత్తి ధర

ధర పెరుగుతుందనే ఆశతో పత్తి నిల్వ చేసిన రైతులకు నిరాశే మిగులుతోంది. వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయిస్తూ నష్టపోతున్నారు. 10లో



పథకాల అమలు పరిశీలన

హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్న కేంద్ర ప్రభుత్వ అధికారులు సంక్షేమ పథకాల అమలు పరిశీలన కోసం జిల్లాకు వచ్చారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
35° / 21°

మంగళవారం తెల్లవారుజామున పలుచోట్ల మంచు ప్రభావం కనిపిస్తుంది. ఆ తర్వాత ఎండ మొదలై సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

గాయత్రీదేవిగా అమ్మవారు



గాయత్రి దేవి అవతారంలో అమ్మవారు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం తెల్లవారుజామున అర్చకులు శ్రీవారికి పంచామృతాలతో అభిషేకం, స్వామి, అమ్మ వార్ల కొలువైన యాగశాలలో హోమం నిర్వహించారు. ఆతర్వాత అలివేలు మంగ అమ్మవారిని శ్రీగాయత్రీదేవి రూపంలో అలంకరించగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ముఖ్య అర్చకులు ఉప్పల విజయదేవశర్మ, మురళీమోహన్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో సంతానలక్ష్మిగా..

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రోవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారు సోమవారం సంతానలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. సంతానం లేనివారు ఈ రూపంలో అమ్మవారిని కొలిస్తే పండంటి పిల్లలు పుడతారని నమ్మిక. ఉదయం అమ్మవారికి ప్రత్యేక స్నపన తిరుమంజనం, పూజలు చేయగా, మధ్యాహ్నం కుంకుమార్చన నిర్వహించగా పెద్దసంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

ప్రారంభమైన 'ఓపెన్' సప్లిమెంటరీ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యాన పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పదో తరగతి పరీక్షకు ఉదయం, మధ్యాహ్నం కలిపి 104మందికి గాను 90మంది, ఇంటర్ పరీక్షకు 112మందిలో 80మంది హాజరయ్యారని డీఈఓ సోమశేఖర శర్మ, ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు తెలిపారు.

రాష్ట్ర కబడ్డీ జట్టులో పీఈటీ దుర్గాదేవి



ఖమ్మం స్పోర్ట్స్: జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీలో పాల్గొనే తెలంగాణ సివిల్ సర్వీసెస్ జట్టుకు నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం జిల్లా పరిషత్ పాఠశాల పీఈటీ దుర్గాదేవి ఎంపికయ్యారు. ఈనెల 16నుంచి 20వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే టోర్నీలో తెలంగాణ జట్టుకు ఆమె ప్రాతినిధ్యం వహిస్తారు. ఈసందర్భంగా దుర్గాదేవిని పలువురు అభినందించారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి ఆర్చరీ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల స్థాయి ఆర్చరీ జట్టు ఎంపిక పోటీలను ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పుట్ట శంకరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ పురుషులు, మహిళల విభాగాలతో పాటు జూనియర్ బాలబాలికల విభాగాల్లో ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో జరిగే పోటీలకు క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు. వివరాల కోసం 93946 43139, 94945 43139 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఆమె చుట్టూ సంక్షేమం!



ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపుతారోనన్న అంశం ఆసక్తికరంగా మారింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లోనూ పురుష ఓటర్లతో పోలిస్తే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉండడంతో రాజకీయ పార్టీల పరంగా ఈ చర్చ జరుగుతోంది. అన్ని నియోజకవర్గాల్లో కలిపి పురుషుల కంటే 57,822 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉండడం విశేషం. అభ్యర్థుల గెలుపు ఓటముల్లో వీరి ఓట్లు కీలకం కానుండడంతో.. అతివలను ప్రసన్నం చేసుకుని గెలుపు బాట పట్టాలన్న వ్యూహంతో రాజకీయ పార్టీలు సాగుతున్నాయి. ఇప్పటివరకు మహిళల సంక్షేమం కోసం అమలుచేసిన పథకాలతో పాటు ప్రస్తుత ఎన్నికల మేనిఫెస్టోలోనూ అధికార, ప్రతిపక్ష పార్టీలు మరిన్ని పథకాలు ప్రకటించడం విశేషం. –సాక్షిప్రతినిధి, ఖమ్మం

అతివలే లక్ష్యంగా మేనిఫెస్టో

ప్రధానంగా మహిళా ఓటర్లే లక్ష్యంగా రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలు ప్రకటించాయి. పురుష ఓటర్లతో పోలిస్తే మహిళా ఓటర్ల నాడి గుంభనంగా ఉండనుండడంతో వారిని ఆకట్టుకునేలా ఆయా పార్టీల నేతలు పథకాలు రూపొందించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మహిళల కోసం ఏం చేస్తారనే అంశాన్ని ప్రచారంలో కూడా ప్రత్యేకంగా ప్రస్తావించేలా ప్రసంగాలు సిద్ధం చేసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో మహిళా ఓటర్లే కీలకం

- పురుషులతో పోలిస్తే 57,822 మంది ఎక్కువ
- అతివలను ఆకట్టుకునేలా అధికార, ప్రతిపక్షాల మేనిఫెస్టోలు
- మహిళల కోసం ప్రత్యేకంగా హామీలు
- పది స్థానాల్లో గెలుపోటములను ప్రభావితం చేయనున్న నారీమణులు

అంతటా వారే..

ఉమ్మడి జిల్లాలో పురుష ఓటర్లు 10,41,726 మంది, మహిళా ఓటర్లు 10,99,548 మంది ఉన్నారు. అత్యధికంగా ఖమ్మం నియోజకవర్గంలో 12,333 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా నమోదు కాగా.. పినపాక నియోజకవర్గంలో తేడా 2,531గా ఉంది. గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో వీరు ఉండడంతో అత్యధిక ఓట్లు రాబట్టుకునేలా అభ్యర్థుల ప్రచార శైలి సాగనుంది. ఓటర్ల పరంగా ప్రతీ నియోజకవర్గంలో వీరిదే పైచేయి కావడంతో రాజకీయ పార్టీలు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నాయి. కుటుంబ ఓటింగ్‌లో మహిళల నిర్ణయమే ఫైనల్ అని భావిస్తూ.. మహిళా స్వయం సహాయక సంఘాలు, క్షేత్ర స్థాయి ఉద్యోగులు, గృహిణులను ఆకట్టుకునేలా ప్రచార కార్యాచరణ రూపొందిస్తున్నాయి.

చేసినవే కాదు.. కొత్తవి కూడా

బీఆర్‌ఎస్ ఇప్పటివరకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య మహిళ, ఒంటరి మహిళలకు పింఛన్ పథకాలు అమలు చేస్తోంది. అలాగే, మహిళల పేరుతోనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటి స్థల పట్టాలు, గృహలక్ష్మి మంజూరు పత్రాలు అందజేస్తోంది. ఆయా పథకాలను బీఆర్‌ఎస్ అభ్యర్థులు తమ ప్రచారంలో ఉపయోగించుకునేలా మండలాల మహిళల అంకెలతో కరపత్రాలు ముద్రించారు. ఇక కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లోనూ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడంతో తాజాగా బీఆర్‌ఎస్ వెల్లడించిన మేనిఫెస్టోలో మహిళల కోసం కొత్త హామీలను ఆ పార్టీ ప్రకటించింది. గతంలో ఉన్న వాటిని కొనసాగించడంతో పాటు తాజాగా మహిళలకు ప్రతినెల రూ.3 వేల జీవన భృతి, రూ.400కే గ్యాస్ సిలిండర్, మహిళా సంఘాల సమాఖ్యలన్నింటికీ సొంత భవనాల నిర్మాణ హామీలను పొందుపర్చింది.

గ్యారంటీలో మహాలక్ష్మి

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను నేతలు గడపగడపకూ తీసుకెళ్లి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలు చేస్తామని చెబుతున్నారు. మహిళా ఓటర్లను ఆకట్టుకునేలా కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో మొదటిగా మహాలక్ష్మిని పేర్కొంది. ఈ పథకం కింద మహిళలకు ప్రతినెల రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని ప్రకటించింది. ఈ హామీలు మహిళా ఓటర్లను ఆకర్షించేలా ఉండడంతో తమకు మెజార్టీ మహిళల ఓట్లు ఖాయమనే అంచనాల్లో ఆ పార్టీ ఉంది.

నియోజకవర్గాల వారీగా మహిళలు, పురుష ఓటర్లు, ఎక్కువగా ఉన్న మహిళా ఓటర్ల సంఖ్య

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	ఎక్కువ
ఖమ్మం	1,64,006	1,51,673	12,333
పాలేరు	1,19,994	1,12,607	7,387
కొత్తగూడెం	1,21,886	1,14,995	6,891
మధిర	1,12,599	1,05,978	6,621
భద్రాచలం	75,909	70,051	5,858
సత్తుపల్లి	1,21,645	1,16,968	4,677
వైరా	97,563	93,185	4,378
అశ్వారావుపేట	78,671	75,080	3,591
ఇల్లెందు	1,09,040	1,05,485	3,555
పినపాక	98,235	95,704	2,531
మొత్తం	10,99,548	10,41,726	57,822

నేడు బీఆర్‌ఎస్ సమన్వయ భేటీ

- ఖమ్మం పార్టీ కార్యాలయంలో నిర్వహణ
- హాజరు కానున్న మంత్రి పువ్వాడ, ఎంపీలు, ఎమ్మెల్సీ, అభ్యర్థులు
- మేనిఫెస్టోపై ప్రచారం, గెలుపు అంశాలపై ప్రధాన చర్చ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) జిల్లా సమన్వయ సమావేశం ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరగనుంది. ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, పార్టీ అభ్యర్థులు సండ్ర వెంకటవీరయ్య, లింగాల కమల్‌రాజు, కందాల ఉపేందర్‌రెడ్డి, బానోతు మదన్‌లాల్‌తోపాటు వైరా సిట్టింగ్ ఎమ్మెల్యే రాములునాయక్ హాజరవుతారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించనున్న నేతలు... ఆతర్వాత విలేకరుల సమావేశంలో మాట్లాడతారు.

ఎన్నికల వ్యూహాలపై చర్చ

వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిసింది. పార్టీ అభ్యర్థులకు హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ ఆదివారం బీ ఫామ్‌లు అందచేయడమేకాక మేనిఫెస్టో విడుదల చేశారు. ఈక్రమంలో అభ్యర్థుల ప్రచారం.. ఓటర్లను కలవడం, బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని వివరించడం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఇక మేనిఫెస్టోలో కొత్త పథకాలను ప్రకటించిన నేపథ్యాన వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించనున్నారు. ఎన్నికలకు 43 రోజుల సమయమే ఉన్నందున ప్రచారాన్ని వేగంగా పూర్తిచేయాల్సిన అంశంపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు.

ముఖ్యమంత్రి సభలకు ఏర్పాట్లు

ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాలో జరిగే సభలకు హాజరుకానున్నారు. ఈనెల 27న పాలేరు, వచ్చేనెల 1వ తేదీన సత్తుపల్లి, 5న ఖమ్మంలో జరిగే బహిరంగ సభల్లో కేసీఆర్ పాల్గొంటారు. ఈ సభలకు సంబంధించిన ఏర్పాట్లు, జన సమీకరణ తదితర అంశాలపై కూడా సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అలాగే, చివరి మూడు రోజులు ప్రచార ఉధృతి పెంచాలని బీఆర్‌ఎస్ నాయకత్వం భావిస్తుండగా.. రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో రోడ్డుషోలు, సమావేశాలకు హాజరుకానుండగా.. ఈ విషయమై కూడా సమావేశంలో చర్చించనున్నట్లు తెలిసింది.

జంగ్ తెలంగాణ

నేను లేని సమయాన దూరారు..



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మేయర్ నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం తదితరులు

- 2014లో మాదిరి ఆయనను మళ్లీ ఓడిస్తా
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మంమయూరిసెంటర్: బీ ఫామ్ తీసుకోవడానికి తాను హైదరాబాద్ వెళ్తే కొందరు ఖమ్మంలో దూరి పలువురిని కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని.. అయినా వారు గెలిచినట్లు కాదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మంలో సోమవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ యువతకు మంచి అవకాశాలు రావాలంటే బీఆర్‌ఎస్ పార్టీ గొప్ప వేదిక అని తెలిపారు. యువత కోసం సీఎం కేసీఆర్ అనేక పరిశ్రమలను తీసుకురావడమే కాక ఐటీ రంగంలో విస్తృత అవకాశాలు దక్కేలా ప్రయత్నించారని చెప్పారు. గొంగళి పురుగులా ఉన్న ఖమ్మంను నాలుగేళ్లలో సీతాకోక చిలుకలా మార్చుకున్నామని తెలిపారు. కేవలం ఖమ్మం నగరంలో 75 వేల పైచిలుకు మందికి ఆసరా పింఛన్లు అందుతుండగా, తాజా మేనిఫెస్టోతో ప్రజలకు మరింత లబ్ధి జరుగుతుందని చెప్పారు. గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏమీ చేయకపోగా... ఇప్పుడేం చేస్తారని అవకాశం అడుగుతున్నారో చెప్పాలని సూచించారు. కాగా, 2014లో తనపై పోటీ చేసిన నేతను ఓడించానని, మళ్లీ ఓడిస్తానని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, ఎవరెన్ని ఎత్తులు వేసినా బీఆర్‌ఎస్ విజయం ఖాయమై పోయిందని మంత్రి చెప్పారు. మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం మాట్లాడుతూ ఖమ్మం నగరాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేసిన మంత్రి పువ్వాడ వెంటే నడుస్తామని అన్నారు. సుడా చైర్మన్ విజయ్‌కుమార్, కార్పొరేటర్లు మక్బూల్, నాయకులు అమరగాని వెంకటేశ్వర్లు, పొన్నం వెంకటేశ్వర్లు, పారా నాగేశ్వరరావు, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ సమ్మేళనంలో పారా ఉదయ్‌తో పాటు 200 మంది బీఆర్‌ఎస్‌లో చేరగా, తొలుత నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అధికారులు

కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల నియమ నిబంధనలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటుచేసిన ఏఎల్‌ఎంటీ, ఏఆర్‌ఓల సమావేశంలో నామినేషన్ స్క్రూటినీ, గుర్తుల కేటాయింపు తదితర అంశాలపై కలెక్టర్ సూచనలు చేశారు. అధికారులు ఎన్నికలకు సంబంధించి ప్రతీ ప్రక్రియలో జాగ్రత్త వహిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఏ దశలోనూ పొరపాటు జరగకుండా చూడాలని సూచించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీపీఓ విజయనిర్మల, జిల్లా ఉపాధికల్పనాధికారి శ్రీరామ్, ఉద్యోగులు రాంబాబు, మదన్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన అవసరం లేదు..

- కొత్త ఓటరు నంబర్‌తో కరపత్రాలు
- ప్రతీ ఓటరుకు అందించేలా కార్యాచరణ

ఖమ్మం సహకారనగర్: ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించడం తప్పనిసరి అంటూ అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. దీంతో పలువురు తమ ఓటరు కార్డు నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో చూసుకుంటే వివరాలు కనిపించడం లేదు. ఇలా ఆందోళన చెందుతున్న వారికి ఊరట కలిగించేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పేరుతో ఓటరు కార్డులు కలిగిన ఓటర్లు 3,31,387మంది ఉన్నట్లు అధికార యంత్రాంగం గుర్తించింది. రాష్ట్రం ఏర్పడ్డాక కొత్త ఓటరు నంబర్ మారిన విషయం తెలియక పాత నంబర్ ఆధారంగా చూసుకుంటే వివరాలు కనిపించడం లేదు. అలాంటి వారి వివరాలను నియోజకవర్గం, మండలాలు, గ్రామాల వారీగా సేకరించి... కొత్త ఓటరు నంబర్ తెలియచేసేందుకు రంగంలోకి దిగారు.

అప్పట్లో 12.. ఇప్పుడు 10

2012కు ముందు జారీ చేసిన ఓటరు కార్డు(ఏపీ కోడ్)పై 12 అంకెల నంబర్ ఉంది. ప్రస్తుతం (ఎస్‌ఎల్‌పీ కోడ్) 10 అంకెలతో నంబర్లు కేటాయిస్తున్నారు. ఈమేరకు పాత నంబర్లు కలిగిన ఓటర్ల వివరాలు సేకరించిన అధికారులు వారి పాత, కొత్త నంబర్లు, చిరునామాతో పత్రాలు ముద్రించారు. వీటిని ఓటర్లకు అందించేందుకు గ్రామాలకు తరలించే ప్రక్రియ కలెక్టరేట్‌లో సోమవారం మొదలుపెట్టగా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాళ్లబండి తదితరులు పర్యవేక్షించారు.

నియోజకవర్గాల వారీగా ఇలా..

జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో పాత ఓటరు కార్డు నంబర్ కలిగిన 3.31.387 మంది ఉన్నట్లు తేలింది. ఇందులో ఖమ్మం నియోజకవర్గంలో 38,270, పాలేరులో 71,778, మధిరలో 77,069, వైరాలో 62,887, సత్తుపల్లి నియోజకవర్గంలో 81,383 మంది ఓటర్లు ఉన్నారు. ఈసందర్భంగా వీరికి పాత, కొత్త నంబర్లతో కూడిన పత్రాలను అందించి సందేహాలు తొలగించనున్నారు.



పత్రాల తరలింపును పరిశీలిస్తున్న ఉద్యోగులు (ఇన్‌సెట్) పాత, కొత్త కార్డుల వివరాలతో కూడిన పత్రం

ఎంసీహెచ్ కిటకిట !



వైద్యసేవల కోసం వచ్చిన గర్భిణులు, బాలింతలు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) వైద్యసేవల కోసం వచ్చిన గర్భిణులు, బాలింతలతో సోమవారం కిటకిటలాడింది. శనివారం అమావాస్య కాగా, ఆదివారం సెలవు రావడంతో సోమవారం ఒక్కసారిగా పోటెత్తారు. దీంతో ఆస్పత్రి లోపల, ఆవరణ రద్దీగా కనిపించింది. మధ్యాహ్నం 12 గంటల వరకే గర్భిణులు, బాలింతల ఓపీ 450 దాటగా.. చిన్నపిల్లల ఓపీ 300 దాటింది. అయితే, ఒకేరోజు ఎక్కువ మంది రావడంతో వైద్యుల వద్ద పరీక్ష చేయించుకుని మందులు తీసుకుని వెళ్లడానికి గంటల తరబడి సమయం పట్టింది.

డీసీసీబీ సీఈఓ రేసులో 12 మంది

- నాలుగు జిల్లాల పోస్టులకు దరఖాస్తులు
- నేడు టెస్కాబ్‌లో ఇంటర్వ్యూలు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) నూతన సీఈఓ(ముఖ్య కార్యనిర్వహణాధికారి) నియామక ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రంలోని ఖమ్మంతో పాటు నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్ డీసీసీబీ సీఈఓ పోస్టుల భర్తీకి టెస్కాబ్ ఆగస్టులో నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో వివిధ డీసీసీబీల్లో పనిచేస్తున్న అధికారులతో పాటు వాణిజ్య బ్యాంకుల్లో విధులు నిర్వర్తించి రిటైర్ అయిన వారు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఖమ్మం జిల్లాకు చెందిన ఉద్యోగులు, అధికారులు కూడా ఉన్నారు. నాలుగు జిల్లాల సీఈఓ పోస్టులకు గాను 17 మంది దరఖాస్తు చేసుకోగా.. వివిధ కారణాలతో ఐదుగురి దరఖాస్తులను టెస్కాబ్ అధికారులు తిరస్కరించినట్లు సమాచారం. దీంతో 12 మంది మిగలగా సోమవారం వరంగల్ డీసీసీబీ సీఈఓ పోస్టును భర్తీ చేసినట్లు సమాచారం. ఇక మిగిలిన మూడు బ్యాంకులకు సీఈఓల ఎంపికకు టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ఆధ్వర్యాన నియామకమైన కమిటీ మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. ఈ కమిటీలోటెస్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్, టెస్కాబ్ ప్రొఫెషనల్ డైరెక్టర్, ఎస్‌ఎల్‌బీసీ ప్రతినిధి, డీసీసీబీ చైర్మన్లు ఉన్నారు.



ఖమ్మంలోని డీసీసీబీ కార్యాలయం

నేడు ఇంటర్వ్యూలు

డీసీసీబీ సీఈఓ పోస్టు భర్తీకి మంగళవారం హైదరాబాద్ టెస్కాబ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. కమిటీ ఆధ్వర్యాన 12 మందిని ఇంటర్వ్యూ చేశాక అర్హతల ఆధారంగా నియామకం చేపడుతుంది. కాగా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వివిధ హోదాల్లో పనిచేసి రిటైర్ అయి అదే బ్యాంకులో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న సామినేని శ్రీనివాస్‌రావుకు ఖమ్మం డీసీసీబీ సీఈఓగా నియమించే అవకాశాలు ఉన్నట్లు చర్చ జరుగుతోంది. ప్రస్తుత సీఈఓ అట్లూరి వీరబాబు పదవీకాలం ఈనెల 19తో ముగియనుండగా, వయసు రీత్యా ఆయన మరోమారు ఎంపికకు అర్హత కోల్పోయారు. దీంతో కొత్త సీఈఓ నియామకానికి చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

సత్తా చాటిన వెయిట్ లిఫ్టర్లు



బహుమతులు గెలుచుకున్న వెయిట్‌లిఫ్టర్లు

ఖమ్మం స్పోర్ట్స్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో ఇటీవల జరిగిన ఐదు జిల్లాల స్థాయి ఓపెన్ బెంచ్ ప్రెస్ పోటీల్లో ఖమ్మం క్లాసిక్ జిమ్ ఫిట్నెస్ అండ్ కార్డియో క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఈమేరకు 66కేజీల విభాగంలో సీహెచ్.మనోజ్‌కుమార్, బి.పవన్, జి.శశికుమార్ మొదటి మూడు స్థానాల్లో నిలవగా, 74 కేజీల విభాగంలో వి.సాయికుమార్, బి.పవన్‌కుమార్ మొదటి, మూడో స్థానం, 83 కేజీల విభాగంలో ఈ.హర్ష ప్రథమ, 105 కేజీల విభాగంలో ఈ.ప్రమోద్ సత్తాచాటగా జిమ్ నిర్వాహకులు సీహెచ్.మనోజ్ కుమార్ చౌదరి, నాగినా చౌదరి అభినందించారు.

సెర్ప్ ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వరరావు



వెంకటేశ్వరరావు

నేలకొండపల్లి: తెలంగాణ గ్రామీణ అభివృద్ధి ఉద్యోగుల సంక్షేమ సంఘం(సెర్ప్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఖమ్మంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెద్దపాక వెంకటేశ్వరావు ఎన్నికయ్యారు. నేలకొండపల్లి మండల సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన మాట్లాడుతూ సెర్ప్ ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో కాంస్యపతకం



కోచ్‌తో మజీద్‌పాషా

రఘునాథపాలెం: మండలంలోని రాంక్యాతండాకు చెందిన మజీద్‌పాషా జాతీయ స్థాయి షాట్‌పుట్ పోటీల్లో కాంస్యపతకం సాధించాడు. హనుమకొండలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న మజీద్‌పాషా ప్రతిభ చాటాడు. ఖమ్మంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కాలేజీలో చదువుతున్న ఆయన ఎం.డీ.గౌస్ వద్ద షాట్‌పుట్‌లో శిక్షణ పొంది జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాడు. ఇటీవల పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన ఆయనను కుటుంబీకులు, గ్రామస్తులు అభినందించారు.

క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించిన మంత్రి

మధిర: ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మధిరకు వచ్చిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రోడ్డు ప్రమాదానికి గురైన ఓ వ్యక్తికి సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఖమ్మం నుంచి ఆయన మధిరకు వస్తుండగా మార్గమధ్యలో ఒక వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. ఈ విషయాన్ని గమనించి మంత్రి తన కాన్వాయ్‌ను ఆపి క్షతగాత్రుడిని మధిరలోని ఆస్పత్రికి తరలించారు. అలాగే, వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించేలా సూచనలు చేశారు.

గిరిజన గ్రామంలో ఐసీఎంఆర్ బృందం

అశ్వాపురం: అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన రాయన్‌పేటను ఢిల్లీకి చెందిన ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) బృందం సోమవారం సందర్శించింది. మలేరియా నియంత్రణలో భాగంగా గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి పలువురి నుంచి రక్తనమూనాలు సేకరించారు. అలాగే, మలేరియా, డెంగీ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. వలస ఆదివాసీ గ్రామాలకు ఛత్తీస్‌గఢ్ నుంచి రాకపోకలతో మలేరియా ప్రబలుతోందని తెలిపారు. ఐసీఎంఆర్ బృందం నెల పాటు జిల్లాలో పర్యటించి మారుమూల వలస ఆదివాసీ గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించడమే కాక మలేరియాకు సంబంధించిన మందుల పనితీరుపై అధ్యయనం చేయనున్నారు. ఐసీఎంఆర్ బృందం సభ్యులు పాడియాభట్, మనిష్‌కుమార్, చంద్రవంశీ, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ స్పందన, అసిస్టెంట్ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు, సబ్ యూనిట్ అధికారి లింగ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,825	1,825
పెసలు	8,350	3,800
కందులు	8,800	4,500
మిర్చి	19,000	13,500
ఏసీ మిర్చి	23,600	18,500
మిర్చి తాలు	8,000	6,000
పత్తి (పాతది)	6,850	5,000
పత్తి (కొత్తది)	6,650	5,000

– ఖమ్మం వ్యవసాయం

పతనం దిశగా పత్తి ధర

విక్రయాలు పెరిగే కొద్దీ ధర కిందకు..

- కనీస మద్దతు ధర కూడా దక్కని దుస్థితి
- ఏడాది కాలంలో రూ.3 వేల మేర పడిపోయిన వైనం
- సీసీఐ కేంద్రాల ఏర్పాటులో ఆలస్యంతో వ్యాపారుల దగా



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పత్తి

ఖమ్మంవ్యవసాయం: పత్తి సీజన్ ప్రారంభమైన వేళ ధర క్రమంగా తగ్గుతుండడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రస్తుత సీజన్‌లో సాగు చేసిన పత్తి పంట ఇప్పుడిప్పుడే చేతికొస్తోంది. ఈ ఏడాది అనుకూలించని వర్షాలతో జిల్లాలో పంట సాగు విస్తీర్ణం తగ్గింది. 2.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అధికారులు అంచనా వేయగా, వర్షాలు ఆలస్యం కావడంతో పంట 1.85 లక్షల ఎకరాకే పరిమితమైంది. జూలైలో కురిసిన వర్షాలు పత్తికి కొంత మేర అనుకూలించినా ఆ తర్వాత పరిస్థితులు కలిసిరాలేదు. వర్షాధారంగా సాగు చేసిన పత్తికి బెట్ట పరిస్థితులు ఎదురుకావడంతో దిగుబడిపై ప్రభావం చూపుతుందని రైతులు చెబుతున్నారు. గత ఏడాది అధిక వర్షాలతో పంట దెబ్బతిని ఎకరాకు ఐదు క్వింటాళ్లు మించి దిగుబడి రాకపోగా, ఈసారి అదే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది.

మద్దతు ధర ఏదీ?

ఆశించిన స్థాయిలో సాగు విస్తీర్ణం, దిగుబడులు లేకపోయినా పత్తి పంటకు కనీస మద్దతు ధర లభించని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తికి తేమశాతం ఆధారంగా క్వింటాకు రూ.7,020గా ధర నిర్ణయించింది. అయితే, జిల్లాలోని ఖమ్మం, ఏన్కూరు మార్కెట్లతో పాటు పలు గ్రామాల్లో వ్యాపారులు పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు. కానీ అంతా సిండికేట్‌గా మారడంతో పాత పత్తికి గరిష్ఠంగా రూ.6,850 ధర చెబుతూ నాణ్యత పేరిట రూ.6,600 నుంచి రూ.5,500 వకే చెల్లిస్తున్నారు. ఇక కొత్త పత్తిలో తేమ శాతం ఉందని చెబుతూ రూ.6,500 నుంచి రూ.5వేల వరకే ధర నిర్ణయిస్తున్నారు. తద్వారా ప్రభుత్వ మద్దతు ధర కన్నా రూ.1,500 నుంచి రూ.2వేల వరకు తక్కువగా అందుతోంది.

సీసీఐ కేంద్రాల ఏర్పాటులో తాత్సారం

పత్తి కొనుగోళ్లకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాలు ఏర్పాటుచేయాల్సి ఉన్నా ఆలస్యం జరుగుతోంది. జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్ల పరిధిలో పది జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు చేయాలని నిర్ణయించారు. రెండేళ్లుగా ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా ప్రైవేట్ మార్కెట్‌లో పత్తికి ఎక్కువ ధర రావడంతో సీసీఐ కేంద్రాల అవసరం రాలేదు. ఈ ఏడాది ధర తగ్గిన నేపథ్యాన వెంటనే ఏర్పాటు చేస్తే రైతులకు న్యాయం జరుగుతుంది. అలా చేయకపోవడంతో ఇదే అదునుగా వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధర నిర్ణయించి రైతులను దగా చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయని రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి.

ఏడాది కాలంలో పతనం ఇలా..

పత్తి ధర ఏడాది కాలంలో రూ.3 వేల మేరకు పతనమైంది. గత ఏడాది నవంబర్‌లో పత్తి క్వింటాకు రూ.9,100గా ధర పలికింది. అదే ఏడాది మే లో రూ.13వేల వరకు కూడా చెల్లించారు. దీంతో రైతులు ఇంకా పెరుగుతుందని ఇళ్లలో పత్తి నిల్వ చేస్తే క్రమక్రమంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం పంట పెట్టుబడులను దృష్టిలో పెట్టుకొని ఇళ్ల వద్ద నిల్వ చేసిన విక్రయింకతప్పడం లేదు. ఇళ్ల వద్ద రూ.9 వేలకు అడిగినా రైతులు విక్రయించకపోగా.. ఇప్పుడు రూ.6 నుంచి రూ.6,500కే విక్రయించాల్సి వస్తోంది.



పత్తి ధరపై చర్చిస్తున్న వ్యాపారులు

గత ఏడాది నవంబర్ నుంచి ధర (క్వింటాకు రూ.ల్లో)

తేదీ	ధర
14-11-22	9,100
09-12-22	8,300
06-01-23	8,300
27-02-23	7,700
15-03-23	7,300
11-04-23	7,900
11-05-23	7,250
15-06-23	6,800
14-07-23	6,700
17-08-23	7,750
15-09-23	7,300
05-10-23	7,000
16-10-23	6,650

ఇంటి వద్ద రూ.9 వేలకు అడిగారు..



పది నెలల క్రితం క్వింటా పత్తి రూ.9 వేలకు అడిగితే ధర పెరుగుతుందని అమ్మలేదు. ఇప్పుడు ఖమ్మం మార్కెట్‌కు తీసుకొస్తే రూ.6,300 నుంచి రూ.6,600వరకు చెల్లించారు. క్వింటాకు దాదాపు రూ.3,500కు పైగా నష్టం వచ్చినట్లే.

– పోలంపల్లి రామకృష్ణ, పెద్దమండవ, ముదిగొండ

ప్రభుత్వం కొనుగోలు చేస్తే బాగుండు



ప్రభుత్వ కొనుగోళ్లు లేకపోవటంతో వ్యాపారులు ఇష్టమున్నట్లు ధర నిర్ణయిస్తున్నారు. సీసీఐ కొనుగోళ్లు చేస్తే కనీస మద్దతు ధరైనా లభించేది. నాలుగెకరాల్లో సాగు చేసిన పత్తి 12 క్వింటాళ్ల తీసుకొస్తే క్వింటాకు రూ.6,500 చొప్పున చెల్లించారు.

– గుండెబోయిన లింగయ్య, సూర్యాపేట జిల్లా

దసరా తరువాత సీసీఐ కొనుగోళ్లు



ఎంపిక చేసిన జిన్నింగ్ మిల్లులో దసరా తర్వాత సీసీఐ పత్తి కొనుగోలు చేయనుంది. ఆరు మార్కెట్ల పరిధిలోని ఆరు జిన్నింగ్ మిల్లులను ఎంపిక చేశాం. రైతుల ఆధార్ కార్డుల ఆధారంగా తేమ శాతం పరిశీలించి ధర నిర్ణయిస్తారు.

– ఎం.ఏ.అలీం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి

రూ.3.68 లక్షల నగదు సీజ్



నగదును సీజ్ చేస్తున్న పోలీసులు

బోనకల్: మండలంలోని బోనకల్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు సోమవారం చేపట్టిన తనిఖీల్లో రూ.2.88లక్షలను సీజ్ చేశారు. ఏపీ నుంచి బోనకల్‌కు ద్విచక్రవాహనంపై వస్తున్న రవిని తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తీసుకెళ్తున్నట్లు గుర్తించి సీజ్ చేశామని పోలీసులు తెలిపారు. సీఐ బాలకృష్ణ, ఎస్ఐ సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరులో రూ.80 వేలు...

కల్లూరు: కల్లూరు చెక్ పోస్ట్ మీదుగా తరలిస్తున్న రూ.80 వేల నగదును సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామని ఎస్ఐ పి.రఘు తెలిపారు.



కాలిపోతున్న వాహనం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బొలేరో దగ్ధం

కల్లూరు: కల్లూరులో విద్యుదాఘాతం కారణంగా బొలేరో వాహనం దగ్ధమైంది. పట్టణానికి చెందిన ఎస్.కే.కమ్లి తన బొలేరో వాహనంలో ఓ శుభకార్యం కోసం సోమవారం సత్తుపల్లి వెళ్లి సాయంత్రం వచ్చారు. వాహనాన్ని ఇంటి ముందు నిలిపి ప్రయాణికులు దిగుతుండగానే విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు మొదలయ్యాయి. దీంతో సమాచారం అందుకున్న సత్తుపల్లి నుంచి అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పినా అప్పటికే వాహనం పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.8లక్షల నష్టం జరిగిందని కమ్లీ వెల్లడించాడు.

రోడ్డుప్రమాద ఘటనపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: గతనెల 24న జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై సోమవారం ఖమ్మంఅర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఖమ్మంలోని శ్రీరాంనగర్ రోడ్డునంబర్–4 మీదుగా ఇంటర్ విద్యార్థి బాబారిషిక్‌ని వీరభద్రం ద్విచక్ర వాహనంపై తీసుకొస్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహం ఢీకొట్టింది. ఈ ఘటనలో విద్యార్థితో వీరభద్రంకు గాయాలుకాగా ఆస్పత్రిలో చేర్పించారు. కాగా, విద్యార్థి తలకు బలమైన గాయం కావడంతో పరిస్థితి విషమించి హైదరాబాద్ తరలించిన నేపథ్యాన బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బెల్ట్‌షాపుల నిర్వాహకులు 50మంది బైండోవర్

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని వివిధ గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న 50 మందిని రఘునాథపాలెం సీఐ కె.శ్రీధర్ ఆధ్వర్యాన సోమవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించి మద్యం అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు సీఐ తెలిపారు.

పులి వచ్చిందనే ప్రచారంతో ఆందోళన

వేంసూరు: పులి సంచరిస్తోందని ప్రచారం జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని కుంచపర్తి, కల్లూరుగూడెం, సత్యనారాయణపురం, అమ్మపాలెం గ్రామాల్లో తిరుగుతోందనే సమాచారం సోమవారం దావానలంలా వ్యాపించింది. కుంచపర్తి, కల్లూరుగూడెం గ్రామాల మధ్య రహదారి వెంట వెళ్తున్న వారికి పులి కనిపించిందని, సత్యనారాయణపురం శివారు పొలాల్లో పాదముద్రలు కనిపించాయని ఒకరి నుంచి ఒకరికి ప్రచారం జోరుగా సాగింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు, పశువుల కాపర్లు ఆందోళనకు గురవుతుండగా, పలువురు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కోడిపందేల స్థావరంపై దాడి

పెనుబల్లి: కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. మండలంలోని పరిధిలోని గణేష్‌పాడు సమీపాన మామిడి తోటలో కోడిపందేలు నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో ఎస్సై జి.సూరజ్ ఆధ్వర్యాన సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కోడిపందేలు నిర్వహిస్తున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని ఒక కోడి పుంజు, 14 మోటారు సైకిళ్లు, రూ.5,900 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఆ సంఘానికి అనుమతి లేదు...

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్1, ఎల్2 టీఆర్‌డీఈడబ్ల్యూ (తెలంగాణ గ్రామీణాభివృద్ధి ఉద్యోగుల సంక్షేమ సంఘం) పేరుతో కొందరు అనుమతి లేకుండానే ఆదివారం కమిటీని ఎన్నుకున్నారని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నరేందర్‌రెడ్డి, బి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు ఉద్యోగులు రిజిస్ట్రేషన్ ప్యానల్ అనుమతి లేకుండా ఈ చర్యకు పాల్పడ్డారని వారు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని డీఆర్‌డీఓకు కూడా విన్నవించినందున నూతన కమిటీని ఉద్యోగులెవరూ పరిగణనలోకి తీసుకోవద్దని వారు ఆ ప్రకటనలో కోరారు.

సంక్షేమ పథకాల అమలుపై పరిశీలన



బోనకల్ : గ్రామస్తులతో సమావేశమైన అధికారులు

బోనకల్/కారేపల్లి: కేంద్ర ప్రభుత్వ పరిధిలో అసిస్టెంట్ సెక్షన్ అధికారులు ఎంపికైన పలువురు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో శిక్షణ పొందుతున్నారు. వీరిలో ఐదుగురు గ్రామస్థాయిలో సంక్షేమ పథకాల అమలుతీరును పరిశీలించేందుకు జిల్లాకు వచ్చింది. జిల్లాలోని బోనకల్ మండలం ముష్టికుంట, కారేపల్లి మండలం భాగ్యనగర్ తండా, కూసుమంచి మండలం గట్టుసింగారం, వైరా మండలం విప్పలమడక, కొణిజర్ల మండలం గుబ్బగుర్తిలో ఐదు రోజుల పాటు పథకాల అమలును వీరు పరిశీలించనున్నారు. బృందంలో అమన్‌బుధావర్, నితిన్‌మిత్రీ, పవన్, గౌతమ్, శశికపూర్ ఉండగా తొలిరోజు గ్రామాల్లో రైతుబంధు, రైతుబీమా, ఉపాధి హామీ పథకం అమలు, ఐసీడీఎస్ ద్వారా అందుతున్న సేవలపై తదితర అంశాలపై చర్చించారు. ఎంపీడీఓలు అశోక్, చంద్రశేఖర్, ఎంపీఓ శాస్త్రి, ఏఓ సరిత, సర్పంచ్ ఇస్లావత్ సుజాత బన్సీలాల్, ఏపీఎం పద్మలత, ఏసీడీపీఓ వీరభద్రమ్మ, పంచాయతీ కార్యదర్శులు రఘు, శ్రీను, అర్జున్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాలిపేరు కాల్వ గండి పూడ్చివేత పనులు ప్రారంభం



గండి పూడ్చివేత పనులు చేపట్టిన దృశ్యం

చర్ల: మండలంలోని తాలిపేరు ఎడమ ప్రధాన కాల్వకు కుదునూరు సమీపంలో ఆదివారం గండి పడగా.. ఇరిగేషన్ శాఖ అధికారులు పూడ్చివేత పనులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఎడమ ప్రధాన కాల్వకు గండి పడి దిగువన ఉన్న సుమారు 18 వేల ఎకరాలల్లోని పంట పొలాలలకు సాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో సోమవారం గండి పూడ్చివేత పనులు ప్రారంభించిన అధికారులు.. తాత్కాలికంగా ఇసుక బస్తాలతో కట్ట ఏర్పాటు చేయించారు. ఇరిగేషన్ డీఈ తిరుపతి ఆధ్వర్యంలో పనులు చేపట్టగా మంగళవారం రాత్రి వరకు పూర్తిచేసి బుధవారం నుంచి సాగునీరు కాల్వ ద్వారా దిగువకు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

కొత్తగూడెంటౌన్: పథకం ప్రకారం వ్యక్తిని హత్య చేసిన కేసులో ముద్దాయికి జీవితఖైదుతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా గణపురానికి చెందిన చెల్పూరి వెంకటేష్, రాధిక దంపతులు ములకలపల్లి మండలం గొల్లగూడెం వచ్చి కిరాణ షాపు, పత్తి వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 2017, సెప్టెంబర్ 20న వెంకటేష్‌ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేయగా, భార్య ములకలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ములకలపల్లికి చెందిన జంగిలి సాయి, జంగిలి రమేష్‌లు హత్య చేసినట్లు గుర్తించారు. వీరిద్దరూ పాల్వంచకు చెందిన పాతూరి పార్థసారథి జామాయిల్ తోటలో పని చేస్తూ చెల్పూరి వెంకటేష్ దగ్గర దొంగతనం చేయాలని ముందస్తుగా పథకం రూపొందించుకున్నారు. ఈ క్రమంలో వెంకటేష్ తన వాహనం దగ్గరకు వచ్చి డబ్బులు లెక్కపెట్టుకుని జేబులో పెట్టుకోగానే ఇనుప రాడ్డుతో తలపై, ముఖంపై బలంగా కొట్టడంతో చనిపోయాడు. వెంకటేష్ జేబులో ఉన్న రూ.21,000 ఇద్దరు పంచుకుని మృతదేహాన్ని పాములేరు వాగు వద్ద జామాయిల్ తోట పక్కన పడవేశారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ సమయంలోనే మొదటి ముద్దాయి జంగిలి సాయి మృతి చెందాడు. 20 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరు రుజువు కావడంతో రెండో ముద్దాయి జంగిలి రమేష్‌కు జిల్లా జడ్జి పాటిల్‌వసంత్ 302 సెక్షన్ ప్రకారం జీవితఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పోసాని రాధాకృష్ణమూర్తి వాదించగా, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్.వీరబాబు, కోర్టు డ్యూటీ ఆఫీసర్, హెడ్ కానిస్టేబుల్ రామారావు సహకరించారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉండొద్దు

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ వారియర్
- జిల్లాలోని స్ట్రాంగ్‌రూమ్‌లు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీ



సత్తుపల్లి: జ్యోతినిలయం పాఠశాలలో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్‌వారియర్



వేంసూరు : అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

వైరా/సత్తుపల్లి: సార్వత్రిక ఎన్నికల విధుల్లో అధికారులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. వైరాలోని వ్యవసాయ మార్కెట్‌లో నియోజకవర్గ స్థాయి ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు కావాల్సిన గోదాంలను సీపీ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్‌లో పరిశర ప్రాంతాలను పరిశీలించడమే కాక పోలింగ్ సామగ్రి పంపిణీకి చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఆతర్వాత సత్తుపల్లిలోని జ్యోతి నిలయం పాఠశాలలో స్ట్రాంగ్‌రూం, ఎన్నికల సామాగ్రి, పంపిణీ, తరలింపునకు గుర్తించిన భవనాలను కలెక్టర్ గౌతమ్, సీపీ వారియర్ పరిశీలించారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు డీసీపీ ప్రసాదరావు, ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి, ఏసీపీలు ఎం.ఏ.రెహమాన్, బి.రామానుజం, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, సీఐ సాగర్‌తో పాటు అధికకారులు రాము, హేమలత, నాగు, శరత్‌బాబు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు, చెక్‌పోస్టుల పరిశీలన

వేంసూరు/పెనుబల్లి/కల్లూరు: వేంసూరు మండలంలోని గూడూరు, వైఎస్ బంజర్, మొద్దులగూడెం గ్రామపంచాయతీలోని పోలింగ్ కేంద్రాలను ఆయన కలెక్టర్ గౌతమ్ సోమవారం పరిశీలించారు. గూడూరు, వైఎస్ బంజర్ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎక్కువ ఓట్లు తొలగించినట్లు తెలుసుకున్న ఆయన డీటీ కరుణశ్రీని ఆరా తీశారు. అలాగే, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఎస్ఐ వీరప్రసా, ఆర్ఐ చిరంజీవి పాల్గొన్నారు. ఇక పెనబల్లి మండలంలోని ముత్తగూడెం, కల్లూరు మండలంలోని తిరువూరు క్రాస్, పేరువంచ వద్ద ఏర్పాటుచేసిన అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ తనిఖీ చేశారు. ఏ వాహనాన్ని వదిలిపెట్టకుండా పక్కాగా తనిఖీ చేస్తూ నగదు, మద్యం అక్రమ రవాణాకు కట్టడి చేయాలని ఆదేశించారు. అలాగే, తనిఖీల సందర్భంగా వీడియో రికార్డ్ చేయాలని సూచించారు. ఆర్‌డీఓ అశోక్‌చక్రవర్తి, అదనపు డీసీసీ ప్రసాదరావు, ఏసీపీ ఏ.రామానుజం, తహసీల్దార్ సాంబశివుడు, ఎస్సై జి.సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

'పక్షపాతంతో వ్యవహరిస్తున్న అధికారులు'



సమావేశంలో మాట్లాడుతున్న శేషగిరిరావు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలోని కొందరు అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తూ కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(1104) డిస్కమ్ ప్రాంతీయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శేషగిరిరావు ఆరోపించారు. ఖమ్మంలోని విద్యుత్ కార్మిక భవనంలో ఖమ్మం రూరల్ డివిజన్ సంఘం సర్వసభ్య సమావేశం డివిజన్ అధ్యక్షుడు టి.శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో శేషగిరిరావు మాట్లాడుతూ పలువురు అధికారులు క్రమశిక్షణ చర్యల పేరిట ఖమ్మం రూరల్ డివిజన్‌లోని కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని, ఇకనైనా వారు తీరు మార్చుకోవాలని కోరారు. అలాగే, కార్మికులు సైతం వినియోగదారులకు అవినీతి రహిత సేవలందిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి పి.సురేష్‌తో పాటు జాకీర్ షరీఫ్, కె.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు మైదానాల పరిశీలన



మైదానాన్ని పరిశీలిస్తున్న ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: నవంబర్ 1న ఇల్లెందులో జరుగు సీఎం కేసీఆర్ బహిరంగ సభ కోసం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సోమవారం పలు మైదానాలను పరిశీలించారు. లలితాపురం చిల్లా ముబారక్ సమీపాన గల ఖాళీ ప్రదేశం, జేకే కాలనీలోని సింగరేణి గ్రౌండ్, 24 ఏరియాలోని సింగరేణి గ్రౌండ్‌ను పరిశీలించారు. అక్కడ క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులను ఉత్సాహపరిచేందుకు రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, టీబీజీకేఎస్ నేతలు ఎస్.రంగనాథ్ పాల్గొన్నారు.